

సహస్ర తులసీ దళార్చన
డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శనివారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు.



ఆలివ్ రిడ్లే తాబేళ్ల మృత్యువాత
ఎంవీపీకాలనీ: విశాఖ పెద జాలరిపేట తీరంలో ఆలీవ్ రిడ్లే తాబేళ్లు పెద్ద ఎత్తున మృత్యువాత పడ్డాయి.

ఘనంగా కూడారై ఉత్సవం


సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో జరుగుతున్న ధనుర్మాస పూజల్లో భాగంగా శనివారం కూడారై ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

8లో

న్యూస్‌రీల్

వివేకానంద.. యువతకు స్ఫూర్తి ప్రదాత



కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి, పాడేరు: స్వామి వివేకానంద యువతకు స్ఫూర్తి ప్రదాత అని, ఆయన చూపిన మార్గంలో అందరూ పయనించాలని అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని విడుదల చేసిన ఓ ప్రకటనలో కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ తెలిపారు. వివేకానంద సూక్తులు యువతకు మార్గదర్శకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఉన్నత చదువులు, సమాజానికి సేవచేయాలనే ఆలోచన నిర్మాణమంతా స్వామి వివేకానంద సూక్తుల ద్వారానే తనకు లభించినట్టు తెలిపారు. గిరిజన ప్రాంతాల్లోని యువతీ,యువకులు స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకుని ఉన్నత లక్ష్యాలను నిర్మించుకోవాలని, క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించడం ద్వారా గిరిజన సమాజానికి ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. మంచి వ్యక్తిత్వాన్ని ప్రతి ఒక్కరూ అలవరుచుకుని, అంది వచ్చిన మంచి అవకాశాలతో మంచి మార్గంలో నడవాలని సూచించారు.

బస్సులు సకాలంలో రాక.. నరకయాతన

- గంటల కొద్దీ ఆర్టీసీ కాంప్లెక్స్‌లో పడిగాపులు



అరకు-విశాఖ బస్సు కోసం అరకు ఆర్టీసీ కాంప్లెక్స్‌లో నిరీక్షిస్తున్న ప్రయాణికులు

అరకులోయటౌన్: ప్రముఖ పర్యాటక కేంద్రం, ఆంధ్రా ఊటీ అరకులోయ నుంచి విశాఖపట్నం వెళ్లే ఆర్టీసీ బస్సులు సకాలంలో రాకపోవడంతో ప్రయాణికులు శనివారం నరకయాతన పడ్డారు. ఇక్కడి నుంచి విశాఖ వెళ్లేందుకు ప్రతి గంటకు ఒక బస్సు ఉంది. అయితే ఆ బస్సులు సకాలంలో రాకపోవడంతో ప్రయాణికులు పిల్లాపాపలతో అవస్థలుపడ్డారు. స్థానికంగా ఉద్యోగాలు చేస్తూ దూర ప్రాంతాలకు వెళ్లే వారితోపాటు పర్యాటకులు, పండగకు ఊళ్లకు వెళ్లే ప్రయాణికులు గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. సంక్రాంతి పండగ సందర్భంగా ఆర్టీసీ బస్సుల సంఖ్యను పెంచకపోగా, సమయపాలన పాటించకపోవడంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలకు గురయ్యారు. ఆర్టీసీ యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం పండగ సమయాల్లోనైనా బస్సు సర్వీసులను పెంచాలని, సమయానికి బస్సులు నడిపేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం





మృతిచెందిన గుర్తు తెలియని వ్యక్తులు

గంగవరం : మండలంలోని గంగవరం - అడ్డతీగల రూట్‌లో 516ఈ హైవేలో చిన్న అడ్డపల్లి వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు దుర్మరణం చెందారు. గుర్తుతెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న గంగవరం ఎస్‌ఐ బి.వెంకటేష్ సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతి చెందిన ఇద్దరి వివరాలు తెలియరాలేదని ఆయన చెప్పారు. మోటార్ బైక్‌పై వెళుతున్న ఇద్దరికీ తలభాగంపై తీవ్రగాయాలై, విపరీతమైన రక్తస్రావంతో అక్కడికక్కడే మరణించారని తెలిపారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ చెప్పారు.

108లో ప్రసవం.. తల్లీబిడ్డ క్షేమం



బిడ్డను చూపిస్తున్న 108 సిబ్బంది

డుంబ్రిగుడ: మండలంలోని కండ్రుమ్ పంచాయతీ పతలంగి గ్రామానికి చెందిన గిరిజన మహిళ శుక్రవారం అర్ధరాత్రి దాటిన తరువాత 2.30 గంటల సమయంలో 108 వాహనంలో ప్రసవించి, మగబిడ్డకు జన్మనిచ్చింది. పతలంగికి చెందిన వంతల ప్రమీల (23)కు అర్ధరాత్రి సమయంలో పురిటి నొప్పులు మొదలయ్యాయి. కుటుంబ సభ్యులు 108 సిబ్బందికి సమాచారం అందించారు. గ్రామానికి వెళ్లిన సిబ్బంది వాహనంలో డుంబ్రిగుడ పీహెచ్‌సీకి తరలిస్తున్న సమయంలో మార్గ మధ్యంలో ప్రసవించింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని, వారిని డుంబ్రిగుడ పీహెచ్‌సీకి తరలించి వైద్యసేవలు అందించినట్టు 108 పైలెట్ శ్యాంసుందర్, ఈఎంటీ సీహెచ్ సుజాత తెలిపారు.

ఊరు ఉసూరు
ఏపీ నిరుటి సంక్రాంతులు



వ్యాపారం లేక పాడేరు పాతబస్టాండ్‌లో వెలవెలబోతున్న కిరాణా దుకాణం

- పండగవేళ పైసలు లేక అవస్థలు
- కలిసిరాని వ్యవసాయం
- గిట్టుబాటు ధర కరవు
- దోచుకుంటున్న దళారులు
- ప్రభుత్వ సాయం నిల్
- కళతప్పిన గ్రామాలు

నాడు ఎటు చూసినా నవరత్నాల కాంతులు.. పంటలకు గిట్టుబాటు ధరలు.. రైతులకు భరోసా సొమ్ము.. చేతి వృత్తులు, ఆటో, ట్యాక్సీ డ్రైవర్లు, మహిళలు ఇలా ఏ లబ్ధిదారుల ఖాతాల్లో చూసిన పథకాల నగదు.. నిత్యం లక్ష్మీ కటాక్షమే.. దీంతో ఎల్లప్పుడూ పల్లెల్లో సంక్రాంతులే... ఇప్పుడు గ్రామాల్లో అందుకు పూర్తి భిన్నమైన దుస్థితి. పల్లె కన్నీరు పెడుతోంది...ఉసూరు మంటోంది... పంటలకు గిట్టుబాటు ధరలు లేవు.. దిగుబడి సగానికి పడిపోయింది... దళారులు, జీసీసీ కనీస రేటుకూడా చెల్లించని స్థితిలో చేతిలో డబ్బులు లేక రైతులు.. పథకాల నగదు లేక మహిళలు, ఇతర వర్గాల వారు ఈసురోమని ఉన్నారు. పిండి వంటలు, కొత్త దుస్తులు, ఇతర ఖర్చులను ఎలా గట్టెక్కాలని జనం దిగులు పడుతున్నారు. పెద్ద పండగ పెద్ద పులిలా కనిపిస్తోంది. సంక్రాంతి ఎలా జరుపుకోవాలో తెలియక జిల్లా వాసులు అయోమయంలో పడ్డారు.

సాక్షి,పాడేరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో సంక్రాంతి పండగంటే పేదకుటుంబాలకు ఫుల్ జోష్‌గా ఉండేది.ప్రభుత్వ పథకాలు,నవరత్నాల పథకాలతో ప్రభుత్వం నుంచి పేద కుటుంబాలకు ఆర్థిక సాయం అందేది.ఈ సొమ్ముతో పేదలంతా ఏ పండగ వచ్చిన ధైర్యంగా, ఆనందంగా జరుపుకొనేవారు.అందులో సంక్రాంతిని మరింత ఘనంగా జరుపుకునే వారు. వ్యవసాయానికి సకాలంలో పెట్టుబడి సాయం, విత్తనాలు, ఎరువులు అందించడంతో దిగుబడులు బాగా వచ్చేవి. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించేది.... అయితే ఇప్పుడు పరిస్థితి పూర్తి భిన్నంగా ఉంది. ఈ సంక్రాంతి వేళ ఆ ఆనందం కరవైంది. కూటమి ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకునే కార్యక్రమాలను అమలుచేయకపోగా,కనీసం ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను కూడా విస్మరించింది.అమ్మకు వందనం పథకం కింద ప్రతి విద్యార్థికి రూ.15వేలు, ఇంటిలో ఎందరు మహిళలు ఉన్నా రూ.15వేల చొప్పున ఆర్థిక సాయం,అన్నదాత సుఖీభవ పేరుతో ప్రతి రైతుకు రూ.20వేల సాయమంటూ హామీలిచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు, కూటమి నాయకులు గత ఏడు నెలల నుంచి ముఖం చాటేశారు. జిల్లాలోని 90శాతం గిరిజనులు నిరుపేదలే. వ్యవసాయం,కూలిపనులు చేసుకుని జీవించే గిరిజన కుటుంబాలంతా ఆర్థికంగా తీవ్ర ఇబ్బందుల్లో కూరుకుపోయాయి. గడచిన ఖరీఫ్‌లో వ్యవసాయానికి కూటమి ప్రభుత్వం పెట్టుబడి సాయం అందించలేదు. అప్పులు చేసి పెట్టుబడి పెట్టిన రైతులకు ప్రకృతి కూడా సహకరించలేదు.తుపానులు,ఇతర ప్రతికూల పరిస్థితులతో వరి, వాణిజ్య పంటల దిగుబడులు తగ్గిపోయాయి. కాస్తోకూస్తో పండిన పంటలకు మార్కెట్‌లో గిట్టుబాటు ధరలు లేవు. దీంతో ఆర్థిక ఇబ్బందులతో ఉన్న గిరిజనులకు సంక్రాంతికి కొత్త దుస్తులు కొనుక్కోలేని దుస్థితి ఏర్పడింది. జిల్లా వాసుల వద్ద నగదు లేకపోవడంతో పండగ వ్యాపారం బాగా తగ్గిపోయింది. జిల్లా కేంద్రం పాడేరులో శనివారం సంక్రాంతి పండగ కళ లేకుండా పోయింది.



ఖాళీగా ఉన్న పాడేరులోని ఫ్యాన్సీ,చెప్పులు, వస్త్ర దుకాణాలు

వ్యాపారం ఢమాల్

వస్త్ర దుకాణాలతో పాటు ఫ్యాన్సీ,చెప్పుల దుకాణాలు,కిరాణా షాపులు వ్యాపారాలు లేక కళ తప్పాయి.వ్యాపారులంతా ఉసూరుమంటున్నారు. గత ఏడాది ఓ మోస్తరు వస్త్ర దుకాణంలో సంక్రాంతి సందర్భంగా రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు వ్యాపారం జరగ్గా, ఈ ఏడాది ఇప్పటికి కేవలం రూ.5లక్షల బిజినెస్ చేసినట్టు సమాచారం. ఒక్కో కిరాణా దుకాణంలో గత ఏడాది రూ.10 లక్షల వరకు విక్రయాలు జరగ్గా ఈ ఏడాది రూ.5 లక్షల మాత్రమే జరిగినట్టు వ్యాపారులు తెలిపారు. ఫ్యాన్సీ, చెప్పుల దుకాణాల్లో రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకూ వ్యాపారం జరగ్గా ఈ ఏడాది కేవలం ఒక్కో షాపులో రూ.50 వేల వరకు విక్రయాలు జరిగాయి. అప్పులు చేసి పెట్టుబడి పెట్టిన వ్యాపారులకు ఏం చేయాలో పాలుపోక అయోమంలో ఉన్నారు. ఇలా రైతులు, వ్యాపారులు, ఇతర వర్గాల ప్రజలు చేతిలో నగదు లేక అవస్థలకు గురవుతున్నారు.



పాడేరు సినిమాహాల్ సెంటర్‌లోని వస్త్ర దుకాణాలు

ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం..



ఈ ఏడాది డబ్బులు లేని పండగగా సంక్రాంతి మారింది. పంటల దిగుబడులు తగ్గిపోవడంతో పాటు సంతల్లో గిట్టుబాటు ధరలు కూడా లేవు.ప్రభుత్వం నుంచి కూడా ఎలాంటి ఆర్థిక సాయం లేదు.గత ప్రభుత్వంలో మా కుటుంబానికి రైతు భరోసా,అమ్మఒడి పథకాలతో సాయం అందేది.ఇప్పటి కూటమి ప్రభుత్వం నుంచి ఇంత వరకు పైసా సాయం అందలేదు.ఈ పెద్ద పండగకు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం.

– బొయిన సన్యాసి, గిరిజన రైతు, తీగలవలస. హుకుంపేట మండలం

పండగ ఎలా గడుస్తుందో



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో అమ్మ ఒడి,రైతు భరోసా,జగనన్న తోడు తదితర పలు పథకాల వల్ల పిల్లల చదువులతో పాటే ఇతర ఏ అవసరానికి అప్పు చేయకుండానే ఖర్చు చేసేవారం. గత సంక్రాంతి సమయంలో నా భర్త, ఇద్దరు పిల్లలు, బంధువులకు దుస్తులుకొని, సంతోషంగా పండగా చేసుకున్నాం. ఈ ఏడాది చేతిలో డబ్బులు లేకపోవడంతో కుటుంబ సభ్యులంతా బాధపడుతున్నాం.

– తామల్ల భాగ్యలక్ష్మి, కామయ్యపేటగ్రామం,హుకుంపేట మండలం

జిల్లాలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సంక్షేమ ఫలాల వివరాలు

పథకం	లబ్ధిదారులు	నిధులు (రూ.కోట్లలో ఏడాదికి)
రైతు భరోసా	1,69,000	127
అమ్మఒడి	1,01,170	152
చేయూత	53,735	100
ఆసరా	85,167	134.37
కాపునేస్తం	1,510	2.26
వాహన మిత్ర	3,353	3.35
సున్నా వడ్డీ	12,818	19.26
జగనన్నతోడు	7,802	7.86
కళ్యాణమస్తు	942	9.35
విద్యాదీవెన	13,578	17.31
వసతిదీవెన	7,550	7.25

సగానికి తగ్గిన బిజినెస్



గత ఏడాది కంటే ఈ ఏడాది వస్త్ర వ్యాపారం బాగా తగ్గింది. గత ఏడాది పండగ సీజన్‌లో రోజుకు రూ. 50వేల చొప్పున సరకు అమ్మేవాడిని. ఈ ఏడాది అది రూ. 25 వేలకు పడిపోయింది. దీంతో ఇబ్బందులు పడుతున్నాం. ప్రజల వద్ద డబ్బులు లేకపోవడమే ఇందుకు కారణం.

– జియాఉద్దీన్ హైదర్, రాజవొమ్మంగి.

దిగుబడి లేక..



ఈ ఏడాది రాగులు,కందులు సాగు చేశాను.పంట దిగుబడి తగ్గిపోయింది. దళారులు రేటు తగ్గించడంతో నష్టపోయాను. అన్నదాత సుఖీభవ సొమ్ము కూడా అందలేదు. దీంతో డబ్బులు లేక పండగ ఎలా చేసుకోవాలో అర్థం కావడంలేదు. గత ఏడాది వ్యవసాయం కలిసి వచ్చింది. రైతు భరోసా డబ్బులు ఉండడంతో ఘనంగా పండగ జరుపుకొన్నాం.

– జన్ని రమేష్, సందివలస గ్రామం, శిరగాం పంచాయతీ, అరకులోయ మండలం

ప్రజల్లో కొనుగోలు శక్తి తగ్గింది



ఈ ఏడాది వ్యాపారం సరిగ్గా జరుగలేదు. ప్రజల్లో గతంలో కంటే కొనుగోలు శక్తి తగ్గింది. దీంతో గ్రామీణప్రాంతంలో వ్యాపారాలు అంతంత మాత్రంగానే నడుస్తున్నాయి. చేతిలో సొమ్ములు లేక ప్రజల్లో పండగ వచ్చిందన్న సంతోషం కరువైంది. రాజవొమ్మంగి వంటి గిరిజన ప్రాంతాల్లో రైతులు, కూలి చేసుకొనే వారే ఎక్కువ. అప్పులు చేసి వ్యవసాయం చేస్తున్న రైతన్నకు వడ్డీ భారం తప్పడం లేదు.

– బి.ఎ.ఎం. దావూద్. కిరాణా వ్యాపారి, రాజవొమ్మంగి

ట్రావెల్ బస్సులపై దాడులు

- 15 బస్సులపై కేసుల నమోదు
- రూ.2లక్షల అపరాధ రుసుం వసూలు



అగనంపూడి(విశాఖ): సంక్రాంతి సందర్భంగా ప్రయాణికుల నుంచి అదనపు చార్జీలు వసూలు చేస్తున్న ట్రావెల్ బస్‌లపై ఆర్టీఏ అధికారులు కొరడా ఝుళిపించారు. హైదరాబాద్, విజయవాడ, తిరుపతి, బెంగళూరు నుంచి వేల సంఖ్యలో ప్రయాణికులు ఉత్తరాంధ్ర జిల్లాలకు వస్తుండటంతో.. వీరి నుంచి ట్రావెల్స్ బస్సుల యజమానులు అదనపు డబ్బులు వసూలు చేస్తున్నారు. దీనిపై ఫిర్యాదులు రావడంతో గాజువాక ఆర్టీవో వి.జయప్రకాష్ పర్యవేక్షణలో శనివారం ఉదయం నుంచి దాడులు నిర్వహించారు. మొత్తం 15 బస్సులపై కేసులు నమోదు చేసి, రూ.రెండు లక్షల వరకు అపరాధ రుసుం వసూలు చేశారు. సరకులు రవాణా చేస్తున్న 10 బస్సులు, అధిక టికెట్ ధర వసూలు చేసిన మూడు బస్సులు, ఓవర్ లోడ్‌తో ప్రయాణం సాగించిన రెండు బస్సులపై కేసులు నమోదు చేసినట్టు ఆర్టీవో తెలిపారు. ఈ నెల 17వ తేదీ వరకు ట్రావెల్ బస్సుల తనిఖీలు ఉంటాయన్నారు. సాధారణ ధరకంటే టికెట్ ధర పెంచి వసూలు చేసినా.. సరకులు రవాణా చేసినా కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

చలిగాలుల విజృంభణ



చింతపల్లి హనుమాన్ జంక్షన్ వద్ద కురుస్తున్న మంచు



పాడేరు మెయిన్ రోడ్డులో చలిమంటలు కాగుతున్న స్థానికులు

అరుకువేలి, హుకుంపేటలలో 4.9 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు

సాక్షి, పాడేరు/చింతపల్లి: జిల్లాలో చలిగాలులు విజృంభిస్తున్నాయి.సాయంత్రం నుంచే చల్లని గాలుల తీవ్రంగా ఉండడంతో పాటు అర్ధరాత్రి నుంచి పొగమంచు దట్టంగా కురుస్తోంది.ఉదయం 10గంటల వరకు మంచు తెరలు వీడడం లేదు. మరోవైపు కనిష్ట ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయి. శనివారం అరకులోయ, హుకుంపేటలలో 4.9 డిగ్రీలు కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదైనట్టు చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో 8.2 డిగ్రీలు, పాడేరు మండలం మినుములూరు కేంద్ర కాఫీ బోర్డులో 9 డిగ్రీలు, అరకులోయ కేంద్ర కాఫీ బోర్డులో 10.5 డిగ్రీలు, జి.మాడుగులలో 7.4 డిగ్రీలు, అనంతగిరిలో 7.6 డిగ్రీలు, పెదబరడలో 8.2 డిగ్రీలు, ముంచంగుపుట్టులో 9.0 డిగ్రీలు, కొయ్యూరులో 10.6 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి, ఉదయం వేళల్లో మంచు అధికంగా కురుస్తుండడంతో లైట్లు వేసుకుని వాహనాలు రాకపోకలు సాగించాల్సి వస్తోంది. సాయంత్రం 4 గంటలు నుంచి చలి గాలులు వీస్తుండంతో వృద్ధులు, చిన్నారులు బయటకు రావడానికి ఇబ్బందులు పడుతున్నారు.

సందడే.. సందడి



సన్‌రైజ్ వ్యూ పాయింట్ వద్ద పర్యాటకులు

అరకులోయటౌన్: మండలంలోని మాడగడ సన్‌రైజ్ వ్యూపాయింట్ వద్ద పర్యాటకులు శనివారం ఉదయం నుంచి సందడి చేశారు. శని, ఆదివారాలు సెలవులు కావడంతో పర్యాటకులు అధిక సంఖ్యలో అరకులోయకు తరలివచ్చారు. శనివారం తెల్లవారు జాము నుంచే మాడగడ సన్‌రైజ్ వ్యూపాయింట్‌కు చేరుకుని గిరిజన థింసా కళాకారులతో కలిసి డప్పువాయిద్యాల నడుమ నృత్యం చేస్తూ సందడి చేశారు. చలిగాలులు, ఎముకలు కొరికే చలిని సైతం లెక్క చేయకుండా ఉదయం 10 గంటల వరకు చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా పొగమంచులో ఉల్లాసంగా గడిపారు. పర్యాటకులు భారీగా తరలిరావడంతో గిరిజన థింసా, డప్పువాయిద్యా కళాకారులతోపాటు చిరు వ్యాపారులు ఆనందం వ్యక్తం చేశారు.



థింసా కళాకారులతో కలిసి నృత్యం చేస్తున్న పర్యాటకులు

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు



8లో

'కాఫీ' లక్ష్యాలు సాధించకపోతే చర్యలు

- ఐటీడీఏ పీవో అభిషేక్



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు : కాఫీ పండ్ల సేకరణ లక్ష్యాలు సాధించకపోతే చర్యలు తప్పవని ఐటీడీఏ పీవో అభిషేక్ హెచ్చరించారు. ఐటీడీఏ సమావేశ మందిరంలో శనివారం అరకు నియోజకవర్గంలోని ఆరు మండలాల కాఫీ ఏఈవోలు, ఫీల్డ్ కన్సల్టెంట్లు, హార్టికల్చర్ కన్సల్టెంట్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 20వ తేదీ నాటికి నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలన్నారు. సాకులు చెబితే సహించేది లేదని హెచ్చరించారు. కాఫీ ప్రాజెక్టులో పనిచేస్తున్న సిబ్బంది పనితీరు మార్చుకోవాలన్నారు. నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేసిన వారికి ప్రోత్సాహకాలు అందజేస్తామని చెప్పారు. 50 శాతం లక్ష్యాలను సాధించిన సిబ్బందిని కొనసాగిస్తామని, అంతకు తక్కువ చేస్తే ఉద్యోగాల నుంచి తొలగిస్తామని తెలిపారు.ఐటీడీఏ ఏపీవో వేంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రూ. 50 కోట్ల విలువ చేసే అప్పన్న భూమి స్వాధీనం



స్వాధీనం చేసుకున్న భూమివద్ద ఆర్డర్ కాపీని చూపిస్తున్న ఈవో త్రినాథరావు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన వేపగుంట సర్వే నంబర్ 181 బాలాజీనగర్‌లోని రూ.50 కోట్ల విలువ చేసే 3.40 ఎకరాల భూమిని శనివారం దేవస్థానం అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దేవస్థానం ఈవో వి.త్రినాథరావు ఆధ్వర్యంలో భూపరిరక్షణ విభాగం అధికారులు సంబంధిత స్థలానికి వెళ్లి ఆ స్థలం చుట్టూ దేవస్థానం గార్డుతో ఫెన్సింగ్ వేయించారు. దేవస్థానం ఈవో త్రినాథరావు మాట్లాడుతూ సర్వే నంబర్ 181లో దేవస్థానానికి చెందిన భూమి 3.40 ఎకరాలు ఉందని, ఆ భూమిని చల్లా వసంతతోపాటు కొంతమంది ఆక్రమించుకోవడంతో 2010 నుంచి వివాదం నడుస్తోందన్నారు. చల్లా వసంతతో పాటు కొంతమంది రాష్ట్ర హైకోర్టులో రిట్ పిటీషన్ వేయగా కోర్టు దేవదాయ చట్టం సెక్షన్ 83 ప్రకారం తొలగించేందుకు ఆదేశాలు జారీ చేసిందన్నారు. దీంతో చల్లా వసంతకు దేవస్థానం నోటీసులు జారీ చేసినా ఎలాంటి స్పందన లేదన్నారు. హైకోర్టు ఉత్తర్వులను అనుసరించి సంబంధిత స్థలాన్ని దేవస్థానం స్వాధీనం చేసుకుందని తెలిపారు. సంబంధిత స్థలంలో ఎలాంటి ఆక్రమణలకు తావులేదని, ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దేవస్థానం లీగల్ సెల్ అడ్వకేట్ ఎస్‌వీఎస్ ప్రసాద్, ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు, ఇన్‌చార్జి డీఈ హరి, లీగల్ సెక్షన్ ఏఈవో వీబీవీ రమణమూర్తి, భూపరిరక్షణ విభాగం సూపరింటెండెంట్ వెంకటరమణ సమక్షంలో భూమిని స్వాధీనం చేసుకున్నారు.

క్లుప్తంగా

చెట్టుపై నుంచి జారిపడి వ్యక్తి మృతి

మారేడుమిల్లి: ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి జారిపడి ఒక వ్యక్తి శనివారం మృతి చెందాడు. మారేడుమిల్లి మండలం వేటుకూరు పంచాయతీ చిలుకుదార గ్రామానికి చెందిన గేదెల లచ్చిరెడ్డి (26) తన ఇంటి సమీపంలోని చెట్టు పైకి ఎక్కాడు. ప్రమాదవశాత్తు కాలు జారి కింద పడ్డాడు. తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎస్.కె.సాధిక్ తెలిపారు.

ట్యాంకర్ నుంచి దూకి వ్యక్తి మృతి


మృతి చెందిన వెంకటేష్

చింతపల్లి: మండలంలో ట్యాంకరు నుంచి కంగారుపడి దూకడంతో అక్కడికక్కడే ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన రాజుపాకలు సమీపంలో వంతెన వద్ద చోటు చేసుకుంది. పోలీసులు అందించి వివరాలిలా ఉన్నాయి. తూర్పు గోదావరి జిల్లా కాకినాడ నుంచి చింతపల్లి మండలం పెంటపాడు వద్ద గల నల్లరాయి క్వారీ వద్దకు తారు తీసుకొస్తున్న ట్యాంకర్ రాజుపాకలు వంతెన సమీపం వచ్చేసరికి బ్రేకులు పడకపోవడంతో కంగారు పడ్డ క్లీనర్ కిందకు దూకడంతో తలకి తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు విజయవాడ సమీపంలో పరిటాలకు చెందిన తన్నీరు వెంకటేష్(22), అవివాహితుడని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బైకులు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు


గాయపడిన యువకుడు

మారేడుమిల్లి: ఎదురుగా వస్తున్న రెండు బైకులు ఢీకొని ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. మండలంలో కూడురు గ్రామానికి చెందిన కుండ్ల కృష్ణారెడ్డి, బోదులూరు గ్రామానికి చెందిన గొర్లె వరప్రసాద్ ద్విచక్ర వాహనాలు మద్దులూరు గ్రామం వద్ద ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. వారిని చికిత్స కోసం రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

మొరాయించిన ఆర్టీసీ బస్సు


నిలిచిపోయిన బస్సు

రాజవొమ్మంగి: నర్సీపట్నం నుంచి రాజవొమ్మంగి మీదుగా రాజమహేంద్రవరం వెళ్ళాల్సిన నర్సీపట్నం డిపో ఆర్టీసీ బస్సు శనివారం రాజవొమ్మంగిలో ఆగిపోయింది. దీంతో గంటల తరబడి మరో బస్సు వచ్చే వరకు ప్రయాణికులు ఎదురు చూడాల్సి వచ్చింది. గేర్లు పనిచేయకపోవడంతో బస్సు నిలిచినట్టు ప్రయాణికులు చెప్పారు. రాజవొమ్మంగి పరిసరాల్లో తరచూ ఆర్టీసీ బస్సులు పలు కారణాలతో నిలిచిపోతున్నాయని, అధికారులు ఇకనైనా కండిషన్‌లో ఉండే బస్సులను నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు.


ఉరకలేస్తున్న ఒంగోలు ఎద్దులు

ఎడ్ల బళ్ల పోటీలకు సిద్ధమవుతున్న పల్లెలు

సంక్రాంతి సందర్భంగా సందడే సందడి

బరిలో ఉరకలు వేసే ఉత్సాహం


పరుగు తీస్తున్న ఎద్దు

చోడవరం: ధాన్య, ధన రాశులతో తులతూగుతూ రైతులు ఆనందంగా ఉన్న రోజుల్లో వచ్చే సంక్రాంతి పండగ ఎన్నో సంప్రదాయ, సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటలకు నెలవుగా ఉంటుంది. ఎన్నో పల్లె సంప్రదాయాలు కనుమరుగవుతున్నప్పటికీ ఇప్పటికీ పల్లె క్రీడలు కొన్ని జనాన్ని అలరిస్తూనే ఉన్నాయి. వీటిలో ప్రధానంగా ఎడ్లబళ్ల పోటీఉ, కోడిపందాలు, గుర్రాల పరుగు పోటీలు పల్లెల్లో సంక్రాంతి శోభను ఇనుమడింపజేస్తాయి. కోడి పందాలపై నిషేధం విధించడంతో సంక్రాంతి పండగంతా ఎడ్ల బళ్ల పరుగు పోటీల వైపే ఆసక్తిగా చూస్తుంది. కనుమ పండగ నుంచి ప్రారంభమయ్యే ఈ ఎడ్ల బళ్ల పోటీలు తీర్థాలు, గ్రామదేవల పండగల సందర్భంగా కూడా నిర్వహిస్తారు. పెద్దపండగ వచ్చిందంటే ఎడ్లబళ్ల పోటీల కోసం జనం ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తుంటారు. ఉమ్మడి జిల్లాలో ఎడ్లబళ్ల పోటీలు ప్రధానంగా చోడవరం, మాడుగుల పరిసర మండలాలైన దేవరాపల్లి, కె.కోటపాడు, చీడికాడ, వూడుగుల, సబ్బవరం, చోడవరం, బుచ్చెయ్యపేట, రోలుగుంట, రావికమతం మండలాల్లో జరిగేవి. క్రమేణా రాంబిల్లి, అచ్యుతాపురం, యలమంచిలి, నక్కపల్లి, కశింకోట, అనకాపల్లి, నర్సీపట్నం, పాయకరావుపేట, కోటవురట్ల తదితర మండలాలకు విస్తరించాయి. కొందరైతే ప్రత్యేకంగా ఈ సంక్రాంతిలో ఎడ్ల బళ్ల పోటీల కోసమే ఒంగోలు, మైసూర్‌తో పలు మేలుజాతి ఎడ్లను లక్షలాది రూపాయలు ఖర్చుచేసి మరీ కొనుగోలు చేసి వాటికి శిక్షణ ఇస్తారు. హింస, జూదానికి తావు లేకుండా కేవలం ఆటవిడుపుగా ఉల్లాసంగా ప్రతి ఒక్కరిలోనూ ఆనందాన్ని నింపే విధంగా గెలుపే లక్ష్యంగా పోటీ ప్రతిష్టతో నిర్వహించే ఈ ఎడ్ల బళ్ల పరుగుల పోటీలు క్రీడాస్ఫూర్తితో జరుగుతాయి. అందుకే ఈ పోటీలకు ప్రజల నుంచి విశేష స్పందన ఉంటుంది. సుదూర ప్రాంతాల నుంచి కూడా ఈ పోటీల సమయానికి సందర్శకులు చేరుకుని ఉత్సాహంగా పోటీలను తిలకిస్తారు.

పోటీలు ఇలా...

పందెంలో పాల్గొనే ఎడ్ల (జత)ను ఎంట్రీల ప్రకారం వరుస నంబర్లు వేసి తేలికపాటి ఎడ్లబళ్లకు ఎద్దులను బూసి పరుగెత్తిస్తారు. ఒక్కో బండి నిర్వహణకు ఇద్దరు వ్మనుషులు ఉంటారు. ఏ ఎడ్ల బండి తక్కువ సమయంలో నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకొని తిరిగి వస్తుందో ఆ ఎద్దులు విజయం సాధించినట్టుగా పరిగణిస్తారు. కొన్ని ప్రదేశాల్లో నాలుగైదు ఎడ్లబళ్లను ఒకేసారి మైదానంలో ఉంచి పరుగుల పోటీ నిర్వహిస్తారు. ఈ తరహా పోటీలు తక్కువగా ఉండగా ఒక్కో బండి పరుగుతీసే పోటీలే ఎక్కువగా జరుగుతుంటాయి. పోటీలో గెలుపొందిన ఎద్దులకు ముందుగా నిర్ధేశించిన పారితోషకాన్ని బహుమతిగా ఇస్తారు.


పోటీలు ఉత్సాహంతో తిలకిస్తున్న ప్రజలు

పోటీలో పాల్గొనే ఎడ్లబళ్లు :

వుంచి వయస్సులో మేలుజాతి హుషారైన ఎద్దులను ఈ పోటీలకు దించుతారు. పందెం సమయంలో బండి బోల్తా పడినా ఎద్దులకు గానీ ఎవరికీ పెద్దగా ప్రమాదం కలగజేయకుండా ఉండే తేలికపాటి బళ్లను ఉపాయోగిస్తారు. ఈ పోటీల కోసం తేలికగా ఉండి ప్రత్యేకంగా బేరింగ్‌లు వేసిన చక్రాలను ఈ బళ్లకు ఏర్పాటు చేస్తారు. ఒక వేళ పోటీల్లో బండి బోల్తా పడినా వెంటనే నిర్వాహకుడు బండి తిరిగి లేపి పరుగు తీసే విధంగా అత్యంత తేలిగ్గా బండి తయారు చేస్తారు.

పోటీలకు ఆటస్థలం :

రైతుతో ముడిపడి నిత్యం రైతుతోనే కలిసి ఉండే ఎడ్లబండితోఎద్దులు పరుగెత్తే ఈ పోటీలో పాఠశాలల్లోను, ఆట స్థలాల్లోను నిర్వహించరు. ఎద్దులు, రైతులు నిత్యం కలియతిరిగే పంట పొలాల్లోనే ఈ పోటీలు నిర్వహిస్తారు. జనవరి నెల ప్రారంభానికి ఖరీఫ్ వరిపంట కోతలు పూర్తవ్వడంతో చాలా పొలాల్లో సంక్రాంతి పండగ జరిగే వరకు ఏ పంట వేయరు.

దీంతో కోతలు జరిగిపోయి ఖాళీగా ఉన్న పొలాలను నిర్దేశించిన లక్ష్యం మేర పొలాల మడుల మధ్య ఉన్న గట్లను తొలగించి ఎడ్లపందాలు నిర్వహిస్తారు. కొన్ని గ్రామాల్లో సమీపంలో నీరులేని సాగునీటి చెరువుల్లో కూడా నిర్వహిస్తారు. రైతులంతా పిల్లా పాపలతో ఉరకలెత్తుతున్న ఎడ్లను తిలకించి వాటికి మరింత ప్రోత్సాహం ఇస్తూ చప్పట్లు కొడుతూ ప్రదర్శనను ఆస్వాదిస్తారు. పోటీలు నిర్వహించేటప్పుడు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందుగా అన్ని ఏర్పాట్లు నిర్వాహకులు చేస్తారు.

ఎన్నో బహుమతులు గెలుచుకున్నా...



నేను పొలం పనులతో పాటు ఎడ్ల బళ్ల పోటీలపై ప్రధానంగా దృష్టి పెట్టి మేలు జాతి ఎద్దులను పెంచుతున్నాను. నా దగ్గర రెండు జతల మేలు జాతి ఎద్దులు ఉన్నాయి. వీటి పెంపకానికి రోజూ భారీగానే ఖర్చవుతుంది. ఏటా జరిగే పందాల్లో 80 నుంచి 110 వరకు పోటీల్లో నా ఎద్దులు ఎక్కువ సార్లు మొదటి బహుమతులు తెచ్చాయి. జిల్లా, ఉత్తరాంధ్ర, ఉభయగోదావరితోపాటు రాష్ట్ర స్థాయి పోటీల్లో సైతం నా ఎద్దులు బహుమతులు గెలుచుకున్నాయి. గతేడాది తూర్పుగోదావరి జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలో వరుసగా మొదటి, రెండో బహుమతులు గెలుచుకున్నాయి. –లెక్కల సత్తిబాబు, లెక్కలవానిపాలెం, చోడవరం

పెంపకంలో జాగ్రత్తలు



వ్యవసాయంలో నాతో కలిసి జీవించే ఎద్దులు పోటీల్లో పరుగులు తీస్తుంటే ఆ ఆనందం చెప్పలేను. రూ.లక్షా 60వేలుపెట్టి ఎద్దులు కొన్నాను. వీటి పెంపకంలో చాలా జాగ్రత్తలు తీసుకొంటాను. మంచి పోషాకాహారంతోపాటు పరిసరాల పరిశుభ్రత కూడా చాలా అవసరం. ఇప్పటి వరకు అనేక పందాల్లో బహుమతులు సాధించాను. ఈ ఏడాది మరిన్ని పోటీలు గెలవాలని ఉత్సాహంగా ఉన్నాను.

–ముమ్మిన రామకృష్ణ, ఎడ్లపెంపకందారుడు, నర్సయ్యపేట

అరకు ఎంపీ తనూజారాణి సీకరి పర్యటన నేడు

సాక్షి,పాడేరు: అరకు ఎంపీ డాక్టర్ గుమ్మా తనూజ రాణి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెట్టి వినయ్‌లు ఆదివారం పెదబయలు మండలం సీకరి గ్రామంలో పర్యటిస్తారు. ఆమెకు ఘన స్వాగతం పలికేందుకు స్థానికులు ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నారు. సంక్రాంతి పండగను సీకరి గ్రామంలోనే ఎంపీ దంపతులు జరుపుకోనున్నట్లు తెలిసింది.

విశాఖ ఉక్కుపై కూటమి కుట్ర

- స్టీల్ ప్లాంట్ జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ లకే రాజారావు


సంఘీభావం తెలుపుతున్న జేఏసీ నాయకులు

సీతంపేట: 'విశాఖ ఉక్కును నిర్వీర్యం చేయాలనే కుట్ర కేంద్రానికి ఉన్నట్టుంది..అందుకే విశాఖ వచ్చిన ప్రధాని మోదీ స్టీల్‌ప్లాంట్ కోసం ఒక్కమాట మాట్లాడలేదు' అని విశాఖ స్టీల్ ప్లాంట్ జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ లకే రాజారావు ఆరోపించారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కూడా స్టీల్ ప్లాంట్ విషయాన్ని ప్రధాని దృష్టికి తీసుకువెళ్లకపోవడం ఉత్తరాంధ్ర ప్రజలను విస్మయానికి గురిచేసిందన్నారు. నక్కపల్లిలో పెట్టబోతున్న ప్రైవేట్ రంగంలోని స్టీల్ ప్లాంట్‌కు హైటెక్ పద్ధతుల్లో ఇనుప ఖనిజాన్ని సరఫరా చేస్తామని సభలో ప్రకటించిన చంద్రబాబు.. విశాఖ స్టీల్ ప్లాంట్ గురించి మాట్లాడకపోవడం కేంద్రం కుట్రలో భాగమేనన్నారు. అమరావతి రైతులకిచ్చిన ప్రాధాన్యత విశాఖ స్టీల్ ప్లాంట్‌కు ఇవ్వక పోవడం దేనికి నిదర్శనమో చంద్రబాబు సమాధానం చెప్పాలన్నారు. బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పి.శివప్రసాద్ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు పూర్తి వ్యతిరేకమని ప్రగల్భాలు పలికిన పవన్ కల్యాణ్ ఇప్పుడెందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు.

రోగుల సేవల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

ముంచంగిపుట్టు: రోగులకు అందించే భోజనాలలో అలసత్యం వహిస్తే సహించేది లేదని డీపీహెచ్ఎస్ డాక్టర్ కృష్ణారావు అన్నారు. మండల కేంద్రంలో గల సీహెచ్‌సీని ఆయన శనివారం తనిఖీ చేశారు. రోగులకు సక్రమంగా భోజనాలు అందడం లేదని, రోగులు ఇబ్బందులు పడుతున్నారని పత్రికలో వచ్చిన కథనాలపై ఆయన ఆస్పత్రిని పరిశీలించారు.నాణ్యతను తనిఖీ చేశారు. తరచూ రోగులకు భోజనాలు అందించడం నిర్లక్ష్యంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో ఇటువంటి ఫిర్యాదులు రోగుల నుంచి వస్తే భోజన నిర్వహణ నుంచి తొలగిస్తామని నిర్వాహకులకు హెచ్చరించారు. నాణ్యత, సకాలంలో భోజనాలు అందించాలని ఆదేశించారు. అనంతరం రోగులతో మాట్లాడి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. సీహెచ్‌సీలో రికార్డులు పరిశీలించారు.వైద్యులతో మాట్లాడి ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలపై ఆరా తీశారు. వైద్యాధికారి సంతోష్ ఉన్నారు.

డాక్టర్ అభిషేక్‌రెడ్డి మృతికి వైఎస్సార్‌సీపీ నేతల సంతాపం

సాక్షి,పాడేరు: వైఎస్సార్‌సీపీ వైద్య విభాగ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ వై.ఎస్.అభిషేక్‌రెడ్డి మృతి చెందడంపై జిల్లాలోని వైఎస్సార్‌సీపీ నేతలు విచారం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎమ్మెల్సీలు డాక్టర్ కుంభా రవిబాబు, అనంతబాబు, అరకు ఎంపీ డాక్టర్ గుమ్మా తనూజరాణి, ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, జిల్లా పార్టీ అధ్యక్షుడు, పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు, అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, మాజీ ఎమ్మెల్యేలు చెట్టి పాల్గుణ, నాగులాపల్లి ధనలక్ష్మి, యువజన విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెట్టి వినయ్ తదితరులు సంతాపం తెలిపారు.

పోలీస్ పరీక్షలకు నాలుగు రోజులు బ్రేక్

ఆరిలోవ: కైలాసగిరి ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీస్ మైదానంలో కానిస్టేబుళ్ల నియామాక పరీక్షలకు నాలుగు రోజులు విరామం ప్రకటించారు. సంక్రాంతి సందర్భంగా ఆదివారం నుంచి 15వ తేదీ వరకు సెలవు ప్రకటించినట్లు అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు.

తిరిగి ఈనెల 16న యథావిధిగా శరీర దారుఢ్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. శనివారం జరిగిన పరీక్షలకు 600 మందికి 319 మంది అభ్యర్థులు హాజరైనట్లు ఆయన తెలిపారు. వారిలో 235 మంది అభ్యర్థులు తదుపరి పరీక్షలకు అర్హత సాధించారన్నారు.

పాత రామవరంలో పల్లె పండుగ

గంగవరం: మండలంలోని పాత రామవరంలో శనివారం పల్లె పండగ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించిన గోశాలను ఎంపీపీ కృష్ణారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశు సంపద ద్వారా గిరిజనులు ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చన్నారు. గోశాలలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపీటీసీ సభ్యురాలు పద్మావతి, సర్పంచ్ పార్వతి, టీడీపీ, బీజేపీ నేతలు అర్జున, వెంకటేశ్వరరావుదొర, ఎంపీడీవో రామకృష్ణ, ఏపీవో ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.


గోశాలను ప్రారంభిస్తున్న ఎంపీపీ కృష్ణారెడ్డి

'తాజంగి' కాలువల మరమ్మతు పనులు ప్రారంభం

చింతపల్లి: మండలంలోని తాజంగి రిజర్వాయర్ కుడి, ఎడమ కాలువల మరమ్మతు పనులను శనివారం సర్పంచ్ వంతల రాజేశ్వరి, నీటి సంఘం అధ్యక్షులు బోనంగి బాలయ్య పడాల్ ప్రారంభించారు. రూ.35 లక్షల వ్యయంతో ఈ పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో నీటి సంఘం వైస్ చైర్మన్ తమరాభ విశ్వనాథం,మాజీ సర్పంచ్ కాంతమ్మ,విద్యాకమిటీ చైర్మన్ మోహనరావు,లక్ష్మణరావు బాబూరావు,శ్యాం సుందరం పాల్గొన్నారు.


మరమ్మతు పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ రాజేశ్వరి , నీటి సంఘం అధ్యక్షుడు బాలయ్య పడాల్

160 కిలోల గంజాయి స్వాధీనం


గంజాయితో పట్టుబడిన వ్యక్తులతో హుకుంపేట పోలీసులు

హుకుంపేట: అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ సురేష్ కుమార్ తెలిపారు. పెదబయలు మండలం వంచుర్బ గ్రామం నుంచి ఎస్.కోట ప్రాంతానికి తరలిస్తున్న సమయంలో ముందుగా అందిన సమాచారం మేరకు కొంతిలి జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీలు చేపట్టగా కారులో గంజాయి ఉన్నట్లు గుర్తించారు. 160 కిలోల గంజాయితోపాటు కారును స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్ పవన్‌కుమార్, గోమంగి గ్రామానికి చెందిన గోమంగి మల్లేశ్వరరావులను శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

ఒప్పో రెనో 13 సిరీస్ ఫోన్ల విడుదల

దాబాగార్డెన్స్(విశాఖ): సెల్ పాయింట్ ఇండియా ఒప్పో రెనో 13 సిరీస్‌ను శనివారం లాంచ్ చేసింది. డాబాగార్డెన్స్‌లోని సెల్‌పాయింట్ షోరూంలో సెల్‌పాయింట్ ఇండియా చైర్మన్ మోహన్ ప్రసాద్ పాండే నేతృత్వంలో సినీనటి డింపుల్ హయాతి ఒప్పో రెనో 13 సిరీస్‌ను మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సెల్‌పాయింట్‌లో ఒప్పో రెనో 13 సిరీస్ లాంచ్ చేయడం ఆనందంగా ఉందన్నారు. ఏ కంపెనీ అయినా అప్‌డేటెడ్ మొబైల్ మార్కెట్‌లోకి అందుబాటులోకి తెచ్చిందంటే.. అది ముందుగా సెల్‌పాయింట్‌లో ఆవిష్కరణ అవుతుందన్నారు. విశాఖపట్నంలో సెల్‌ఫోన్లకు సంబంధించి సెల్ పాయింట్ అడ్డాగా మారిందన్నారు. మంచి ఫీచర్స్‌తో ఒప్పో రెనో 13 సిరీస్ మార్కెట్లో అందుబాటులో ఉందన్నారు. మోహన్‌ప్రసాద్ పాండే మాట్లాడుతూ విశాఖపట్నంలో తొలిసారిగా డైమండ్ పార్క్ వద్ద సెల్‌పాయింట్‌ను ప్రారంభించామన్నారు. అంచెలంచెలుగా ఎదుగుతూ విశాఖలో 29, రాష్ట్ర వ్యాప్తంగా 82 సెల్‌పాయింట్ స్టోర్లకు విస్తరించినట్లు వివరించారు. 25 ఏళ్లగా నాణ్యత గల ఉత్పత్తులు, వినియోగదారుల సేవలందించడంలో సెల్ పాయింట్ విశ్వసనీయతగా నిలిచిందన్నారు. నూతన ఒప్పో రెనో 13 సిరీస్ కొనుగోలుపై లక్కీ డిప్ ద్వారా బైక్‌తో పాటు పలు బహుమతులు అందజేయనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో సెల్‌పాయింట్ ప్రతినిధి బాలాజీ పాండే, పోతు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఒప్పో రెనో 13 సిరీస్‌ను లాంచ్ చేస్తున్న సినీ హీరోయిన్ డింపుల్ హయాతి, సెల్‌పాయింట్ ఇండియా చైర్మన్ మోహన్‌ప్రసాద్ పాండే, బాలాజీ పాండే

ఘనంగా కూడార్రై ఉత్సవం

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో జరుగుతున్న ధనుర్మాస పూజల్లో భాగంగా శనివారం కూడార్రై ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అలాగే ఈనెల 13న భోగి పర్వదినంరోజు సాయంత్రం జరిగే గోదా రంఘనాథుల కల్యాణోత్సవానికి సంబంధించి ఎదురు సన్నాహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం గోదాదేవి ఉత్సవమూర్తిని ఆలయంలో తిరువీధిగా సింహగిరిపై ఉన్న గంగధార వద్దకు తీసుకెళ్లారు. అనంతరం అక్కడ అమ్మవారిని విశేషంగా అలకరించి పల్లకిలో వేంజింపజేసి ఆలయం వద్దకు తీసుకొచ్చారు. ఆలయంలోంచి శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను పల్లకిలో తీసుకొచ్చి నీలాద్రి గుమ్మంవద్ద ఆస్థానమండపంలో వేంజింపజేశారు. ఎదురు సన్నాహోత్సవాన్ని వైభవంగా జరిపారు.అనంతరం కూడార్రై ఉత్సవ విన్నపపారాయణాన్ని చేశారు. ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతా రామాచార్యులు, అర్చకుడు సాతులూరి నరసింహాచార్యులు తదితరులు పాల్గొన్నారు.


కుండలు కొనుగోలు చేస్తున్న గిరిజనులు

గ్రామాల్లో సంతలు

ముంచంగిపుట్టు/హుకుంపేట/రాజవొమ్మంగి: జిల్లాలోని ముంచంగిపుట్టు, హుకుంపేట, రాజవొమ్మంగి మండలాల్లో శనివారం వారపు సంతలు జరిగాయి. పండగ సంత కావడంతో అధిక సంఖ్యలో గిరిజనులు తరలివచ్చారు. సంతల్లో దుస్తులు, నిత్యావసర సరకులు, మేకలు, కోళ్లు , కుండలను విక్రయించారు. దుస్తుల వ్యాపారం బాగా జరిగిందని పలువురు చెప్పారు. అటవీ, వ్యవసాయ ఉత్పత్తుల వ్యాపారం జరిగింది. సంత జరిగే ప్రాంతంలో ట్రాఫిక్ స్తంభించకుండా పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.